క్లుప్తంగా

ఘనంగా మానసిక ఆరోగ్య దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

మునగపాక: మునగపాకలో గురువారం మానసిక ఆరోగ్య దినోత్సవం ఘనంగా జరిగింది. మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ మెయిన్‌రోడ్డు మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక రోగుల పట్ల ప్రేమానురాగాలు చూపాలన్నారు. ఎటువంటి వివక్ష చూపరాదన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో దేవకాంత, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక పంచాయతీ కార్యదర్శిగా శ్రీనివాసరావు

మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాక కార్యదర్శిగా గ్రేడ్-1 అధికారి ఎస్.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఈశ్వరరావు బదిలీ కావడంతో అతని స్థానంలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలానికి చెందిన శ్రీనివాసరావును నియమించారు. ఈ మేరకు ఆయన గురువారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా మునగపాక గ్రామ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



ఈవోఆర్డీ వెంకటలక్ష్మిని సత్కరిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి, డీఎల్‌డీవో మంజులావాణి

మునగపాక: అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మునగపాక మండల పరిషత్‌లో ఈవోఆర్డీగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న వెంకటలక్ష్మిని గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో అందరి మన్ననలు అందుకున్న వెంకటలక్ష్మిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. . ఎంపీడీవో ఎం.ఉషారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఎల్‌డీవో మంజులావాణి, సూపరింటెండెంట్ ప్రసాద్, మండల పరిషత్ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీ వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జయప్రకాషరావు

పాయకరావుపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో పల్లె పండగ, పంచాయతీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీవో జయప్రకాష్‌రావు కోరారు. ఆయా గ్రామాల సచివాలయ కార్యదర్శులతో మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి పల్లె పండగ, పంచాయతీ వారోత్సవాలపై అవగాహన కల్పించాలన్నారు.

మునగపాకలో రేపు సాంస్కృతిక కార్యక్రమాలు

మునగపాక: విజయదశమిని పురస్కరించుకుని శనివారం మునగపాకలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఎస్‌ఆర్‌ఐ పెంటకోట శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, దివంగత నేత పెంటకోట సత్యనారాయణ, పెంటకోట పట్టాభిరామునాయుడు(గాంధీ)ల జ్ఞాపకార్థం మునగపాక నందీశ్వర ప్రాంగణంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి చిన్నపిల్లలకు రంగుల రాట్నం, జంపింగ్ వంటి క్రీడలు, అలాగే తప్పెటగుళ్ల, కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అదే రోజు రాత్రి భారీగా బాణసంచా వెలిగిస్తామన్నారు. ఈ కార్యక్రమాలకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని శ్రీకాంత్ కోరారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- వరాహ నది నుంచి రాత్రి వేళ తరలింపు
- పట్టించుకోని అధికారులు



పోలీసులకు ఇటీవల పట్టుబడిన ఇసుక ట్రాక్టర్



బంగారమ్మపాలెం సమీపంలో సముద్రపు ఇసుక రవాణా చేస్తున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మైన్స్ అధికారులు

ఎస్.రాయవరం: మండలంలో ఇష్టారాజ్యంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా రోజూ నాటు బళ్లు, ట్రాక్టర్లతో ఇసుక తరలిపోతోంది. ప్రభుత్వ యార్డులో ఇసుక సరఫరా సక్రమంగా జరగకపోవడంతో అక్రమార్కులు ప్రత్యేక మార్గాలు ఎంచుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని ఇసుక యార్డు ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల ఈ యార్డులో సక్రమంగా ఇసుక సరఫరా జరగకపోవడం, అదనపు వసూళ్ల వంటి సమస్యలు పెరిగాయి. దీంతో ఇసుక అక్రమ రవాణా పెరిగిపోయింది. మండలంలో వరాహ నదిలో గుట్టుచప్పుడు కాకుండా ఇసుకను తవ్వి రాత్రి వేళ కొందరు, తప్పుడు బిల్లులతో మరికొందరు తరలించుకుపోతున్నారు. అదే క్రమంలో బంగారమ్మపాలెం, చిన ఉప్పలం, రేవు పోలవరం తదితర ప్రాంతాల్లో సముద్ర తీరం నుంచి కూడా ఇసుకను తరలిస్తున్నారు. నది ఇసుకలో సముద్ర ఇసుకను కలిపి విక్రయించి పలువులు సొమ్ము చేసుకుంటున్నారు. వీరికి అధికార పార్టీ నాయకులు మద్దతు తోడవ్వడంతో అక్రమ రవాణా బ్రేకులు లేకుండా సాగుతోంది. పోలీసుల దాడుల్లో అడపాదడపా ఇసుక రవాణా వాహనాలు పట్టుబడినప్పటికి, కేసులు తీవ్రత లేకపోవడంతో అక్రమార్కులకు కలిసొచ్చింది. దీన్ని అవకాశంగా భావించి ఇసుకను తరలించి జేబులు నింపుకొంటున్నారు. అధికారులకు నిత్యం కంట పడకుండా ఉండేందుకు దార్లపూడి, లింగరాజుపాలెం, ఎస్.రాయవరం, పెదఉప్పలం, సర్వసిద్ధి ప్రాంతాల్లో నాటు బళ్ల ఉపయోగించి ఇసుకను నదిలో నుంచి బయటకు తీసి గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్లకు లోడ్ చేసి తరలించుకుపోతున్నారు. ప్రభుత్వ ఇసుక దొరకని కారణంగా అక్రమంగా తవ్వి తీసుకొస్తున్నామని చెప్పి మరీ వ్యాపారులు అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా గ్రామ స్థాయి, ఆపై మండల స్థాయి అధికారులకు తెలిసినా చర్యలు మాత్రం నామమాత్రంగా ఉన్నాయని పలువురు విమర్శిస్తున్నారు.

యార్డులో ఇసుక లేదు..



ప్రభుత్వ యార్డు నుంచి ఇసుక సక్రమంగా సరఫరా కావడంలేదు. ఒక వేళ వచ్చినా రేటు పెంచి అమ్ముతున్నారు. దీంతో మా ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా పెరిగిపోయింది. అలా తెచ్చిన ఇసుకను అధిక ధరకు కొనాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇసుక సరఫరాపై దృష్టి సారించాలి.

– జి.సత్యనారాయణ, వమ్మవరం

ఇసుక రవాణాదారులపై కఠిన చర్యలు



ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. తాను కొత్తగా బాధ్యతలు చేపట్టా. ఇసుక తవ్వకాలు ఉన్న గ్రామాల వివరాలు ఇవ్వాలని వీఆర్వోలకు ఆదేశాలు జారీ చేశాం. ఆ గ్రామాలు పరిశీలించి నిఘా పెడతాం. పట్టుబడితే కేసులు నమోదు చేస్తాం.

– రమేష్‌బాబు, తహసీల్దార్, ఎస్.రాయవరం మండలం

దాడి కేసులో ఆరుగురికి జరిమానా

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణంలో 2021 జనవరి 20న కాకివాని వీధిలో జరిగిన ఓ గొడవకు సంబంధించిన కేసులో ఆరుగురు నిందితులకు రూ.90 వేలు జరిమానా విధిస్తూ యలమంచిలి ఏఎస్‌జే కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చినట్టు పట్టణ ఎస్ఐ కె.సావిత్రి గురువారం మీడియాకు తెలిపారు. కనకమహాలక్ష్మి జాతర రోజున నిందితులు చిన్నం చిరంజీవి, దిగుమర్తి అప్పారావు, దిగుమర్తి కనకరాజు, చిన్నం సంఘవయ్య, మంజేటి వినయ్, మంజేటి శ్రీకాంత్‌లు కాకివాని వీధికి చెందిన చిన్నం భాను కనకరాజుపై దాడి చేశారు. బాధితుడిచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు తుది విచారణ తర్వాత న్యాయమూర్తి ఆరుగురు నిందితులకు జరిమానా విధించారు.

ఆదమరిస్తే అంతేమరి!

కోటవురట్ల: గ్రామీణ రహదారులు వాహనదారులను ఇక్కట్లకు గురిచేస్తున్నాయి. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలతో పలు గ్రామాలకు వెళ్లే రహదారులు దారుణంగా తయారయ్యాయి. పెద్ద గోతులు పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. చిన్నపాటి వర్షానికే గోతులు చెరువులను తలపిస్తున్నాయి. రాజుపేట, చౌడువాడ, యండపల్లి-అన్నవరం, అన్నవరం, వేములపూడి రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



యండపల్లి-అన్నవరం రహదారి దుస్థితి

తహసీల్దార్ రమేష్‌బాబుకు అభినందనలు

ఎస్.రాయవరం: మండల ప్రజలకు నిస్వార్థంతో కూడిన సేవలు అందించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు తహసీల్దార్ రమేష్‌బాబును కోరారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను పార్టీ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. దుశ్శాలువా కప్పి సత్కరించారు. రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు, భూసమస్యలను సత్వరమే పరిష్కరించి, విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, స్థానిక నాయకుడు యల్లపు నాగు, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ రమేష్‌బాబును అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భగీరథమ్మ ఆలయంలో నవ దుర్గలకు పూజలు



హరిపాలెం-అందలాపల్లి భగీరథమ్మ ఆలయంలో నవ దుర్గలకు పూజలు చేస్తున్న భక్తులు



వీసం స్వగృహంలో అంబలం పూజ నిర్వహిస్తున్న భక్తులు



మునగపాక దళితవాడలో అంబలం పూజలో పాల్గొన్న బొడ్డేడ ప్రసాద్, తదితరులు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం హరిపాలెం-అందాలపల్లిలో కొలువుదీరిన భగీరథమ్మ ఆలయంలో గురువారం నవ దుర్గలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9 మంది పిల్లలను నవ దుర్గలుగా అలంకరించి దేవునితో సమానంగా పూజలు చేశారు. 100 రకాల స్వీట్లను నైవేద్యంగా సమర్పించారు. నవరాత్రి ఉత్సవాల్లో ఈ పూజను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మునగపాక: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి మునగపాక దళితవాడలో అంబలం పూజ ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు. దుర్గమ్మ నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ పిల్లి కనకలక్ష్మి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజాన బుజ్జి, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేత్ర పర్వంగా దుర్గమ్మ అంబలం పూజ

పాయకరావుపేట: నక్కపల్లిలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ నేతృత్వంలో బుధవారం రాత్రి దుర్గాదేవి అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. అరటి డొప్పలతో అందమైన మందిరాన్ని తయారు చేసి, గురు భవానీలు దవరసింగి రాంబాబు, పనరకొండ పండు శర్మ, శ్రీపాద ప్రసాద్, కేవీఎస్ సత్యనారాయణ, బొడ్డా ప్రసాద్, పెదిరెడ్డి రమేష్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు అగ్ని గుండంలో నడిచి తమ భక్తిని చాటుకున్నారు. అంబలం పూజకు నక్కపల్లి, ఉపమాక, సారె పల్లిపాలెం, ఎంబీ పాలెం, తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భవానీ భక్తులు తరలివచ్చారు.

సేకరించిన చెత్త గ్రామంలోనే డంపింగ్

ఎస్.రాయవరం:కొరుప్రోలు గ్రామంలో సేకరించిన చెత్త మళ్లీ గ్రామానికి ఆనుకుని నివాసాల మధ్య డంప్ చేస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువల నుంచి, ఇళ్లలోని చెత్తను పంచాయతీ ట్రాక్టర్లతో తీసుకొచ్చి నివాసాలకు అతి సమీపంలో పడేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామ శివారులో తడి, పొడి చెత్తల నిర్వహణ కేంద్రం నిర్మాణం చేశారని, కనీసం ఆ ప్రాంతంలోనైనా చెత్తను వేయాలని కోరుతున్నారు. పంచాయితీ అధికారులు దృష్టి సారించి చెత్త సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



నివాసాలకు ఆనుకుని చెత్తను నిల్వ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

స్వచ్ఛభారత్ అందరి లక్ష్యం కావాలి



ఏటికొప్పాకలో చెత్త తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది



రాజీవ్ క్రీడా మైదానంలో తుప్పలు, చెత్త తొలగిస్తున్న ఉద్యోగులు, స్థానికులు

యలమంచిలి రూరల్: స్వచ్ఛభారత్ అందరి లక్ష్యం కావాలని మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి, కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు పిలుపునిచ్చారు. యలమంచిలి పట్టణంలోని రాజీవ్ క్రీడా మైదానంలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. సామూహిక పరిశుభ్రతా కార్యక్రమంలో భాగంగా పట్టణ వాకర్స్ అసోసియేషన్, మున్సిపల్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, స్థానికులతో కలిసి క్రీడా మైదానంలో తుప్పలు, చెత్త తొలగించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ బ్యానర్ ప్రదర్శిస్తూ పారిశుధ్యంపై స్థానికులకు అవగాహన కల్పించారు. వారంలో ఒకరోజు ఇలాంటి కార్యక్రమం చేపడితే పట్టణంలో పారిశుధ్యం మెరుగుపడడంతో పాటు ప్రజల్లో అవగాహన పెరుగుతుందని అందరూ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, పలువురు విశ్రాంత ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏటికొప్పాకలో..

యలమంచిలి రూరల్: మండలంలోని ఏటికొప్పాక మేజర్ పంచాయతీలో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం జరిగింది. గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద చెత్తకుప్పల్ని, సమీపంలో రహదారికి ఇరువైపులా చెత్తను తొలగించారు. తొలగించిన చెత్తను గ్రామ సమీపంలో డంపింగ్ యార్డుకు తరలించారు. పారిశుధ్య లోపం తలెత్తకుండా ప్రజల సహకారంతో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ దీపిక, గ్రామ సర్పంచ్ భజంత్రీల లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కేఎస్ ప్రసాద్, అన్నం బాబ్జీ, అచ్చెన్నాయుడు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మునగపాక మెయిన్‌రోడ్డులో శుభ్రం చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

మునగపాకలో ‘స్వచ్ఛతా హీ సేవా’

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌డీవో మంజులావాణి కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం మునగపాకలో ప్రజా ప్రతినిధులు, అధికారులు 4 గంటల పాటు పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామం సుందరంగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఎంపీడీవో ఎం.ఉషారాణి, మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, పెద్దలు దాడి ముసిలినాయుడు, దాడి శివ, ఆడారి లక్ష్మణరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తుప్పల తొలగింపు

పాయకరావుపేట: పట్టణంలోని రోడ్లపై పెరిగిన తుప్పలను సిబ్బంది తొలగించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఈవోఆర్‌డీ సిహెచ్. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న చెత్త, డ్రైనేజీలో పూడిక తీత పనులు చేపట్టారు.



పాయకరావుపేటలో తుప్పలు తొలగిస్తున్న సిబ్బంది



కోటవురట్లలో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ చేస్తున్న అధికారులు

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కోటవురట్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ అన్నారు. మండలంలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రాట్నాలపాలెం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు రహదారుల్లో స్వచ్ఛ సర్వేక్షన్ చేపట్టారు. రహదారుల వెంబడి ప్లాస్టిక్ కవర్లు ఏరివేసి శుభ్రం చేశారు. మండల పరిషత్ కార్యాలయం ముందు ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, సిబ్బంది తొలగించారు. ర్యాలీ నిర్వహించి, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఏవో చంద్రశేఖర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

ప్రభుత్వం సాగునీటి కాలువల పూడికతీతకు నిధులు మంజూరు చేయకపోవడం, మరోవైపు అధికారుల నిర్లక్ష్యం తాండవ రైతుల పాలిట శాపంగా మారింది. తాండవ రిజర్వాయరులో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నా పంట కాల్వలు మూసుకుపోవడంతో శివారు ఆయకట్టుకు నీరందడం లేదు. వర్షం పడితేనే శివారు ఆయకట్టు పంట పొలాలకు నీరు సరఫరా అవుతుంది.

- తాండవలో పుష్కలంగా నీరున్నా శివారు భూములకు అందని వైనం
- కాలువ పూడికతీత పనులకు నిధులివ్వని ప్రభుత్వం
- వరుణ దేవుడు కరుణిస్తేనే పంట చేతికొచ్చేది..



తాండవ ప్రధాన కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా పెరిగిన చెట్ల కొమ్మలు, తుప్పలు

నాతవరం : ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరుణుడు కరుణించడంతో తాండవ రైతులకు ఇంత వరకు నీటి కష్టాలు లేకుండా సాగుతుంది. అయితే ఎండ తీవ్రత అధికంగా ఉంటే శివారు ఆయకట్టు వరి పొలాలకు నీరు అందడం కష్టంగా మారింది. తాండవ రిజర్వాయరు నీరు ఆధారంగా ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో రెండు జిల్లాల పరిధిలో 52,465 ఎకరాలు వరి పంట సాగు చేస్తుంటారు. సాధారణంగా ఏటా ఏప్రిల్ నుంచి జూన్ వరకు తాండవ కాలువలో పూడికతీత పనులు చేపట్టాల్సి ఉంది. పూడికతీత పనులు చేస్తేనే శివారు ఆయకట్టుకు ప్రాజెక్టు నీరు అందుతుంది. కానీ ఈ ఏడాది ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో తాండవ కాలువలకు పూడిక తీత పనులు చేయలేదు. ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీరు సరఫరా చేసేందుకు ప్రధాన కాలువలకు పిల్ల కాల్వలు కలుపుకొని మొత్తం 120 కిలోమీటర్ల పొడవునా రెండు జిల్లాల పరిధిలో ఉన్నాయి. ఆ కాలువలో పూడిక తీయకపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డుగా తుప్పలు పెరిగిపోయాయి. ప్రస్తుతం తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం 378 అడుగులు దాటి ప్రమాద స్థాయిలో ఉంది. ఆయకట్టు భూములకు ప్రధాన కాలువల ద్వారా రోజుకు 550 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కానీ పూడిక కారణంగా శివారు భూములకు నీరు ప్రవహించడం లేదు. నర్సీపట్నం మండలం బలిఘట్టం మేజరు శివారు భూములు, కోటవురట్ల మండలం పాములవాక చిన బొడ్డేపల్లి మేజరు శివారు భూములకు సాగునీరు అందడం లేదు. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం బి.హెచ్.కోట ఇండుగబిల్లి మేజరు, కె.ఈ చిన్నయ్యపాలెం మేజరు శివారు ఆయకట్టుకు, రవతలపూడి మండలంలో శివారు భూములకు నీటి ప్రవాహం అంతంతమాత్రంగా ఉంది.

అధికారుల బదిలీతో మరింత సమస్య

ఇటీవల జరిగిన అధికారుల బదిలీల్లో భాగంగా తాండవ కాలువలపై పూర్తి అవగాహన ఉన్న నలుగురు జేఈలు శ్యామ్‌కుమార్, వినయకుమార్, రామకృష్ణ పాత్రుడు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. గతంలో తాండవ కాలువపై నీటి పర్యవేక్షణకు సుమారు 40 మంది పైగా లష్కర్లు ఉండేవారు. అందులో 90 శాతం లష్కర్లు పదవీ విరమణ చేశారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించలేదు. దీంతో ఖరీఫ్ సీజన్‌లో శివారు ఆయకట్టుకు వరుణుడు కరుణిస్తేనే నీరు అందుతుందని రైతులు చెబుతున్నారు.

బోధనేతర సిబ్బంది నియామకానికి దరఖాస్తులు

నాతవరం : మండలంలో మర్రిపాలెంలో గల కస్తూరిభా పాఠశాలలో పని చేసేందుకు బోధనేతర సిబ్బంది నియమకాల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చునని ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ మర్రిపాలెం కేజీబీవీ పాఠశాలలో నైట్ వాచ్‌మన్‌గా పని చేసేందుకు ఆసక్తి గల మహిళలు ఈనెల 15వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు వయో పరిమితి సడలింపు ఉందన్నారు.

మద్యం షాపుల దరఖాస్తులకు నేడు ఆఖరు

అనకాపల్లి: పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం షాపుల ఏర్పాటుకు శుక్రవారం రాత్రి 7 గంటల లోపు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ స్టేషన సీఐ లక్ష్మణ్‌నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్యలక్ష్మీ గ్రాండ్ ఫంక్షన్ హాల్లో ఈ నెల 14న ఉదయం 8 గంటలకు మద్యం షాపు దరఖాస్తుదారుల డ్రా వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే హోటల్ సీజ్

- కమిషనర్ సురేంద్ర

నర్సీపట్నం: హోటల్ యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర హెచ్చరించారు. మున్సిపాలిటీలో పెదబొడ్డేపల్లి వంతెన వద్ద ఉన్న హోటల్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిల్వ మాంసం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో చర్యలకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబును ఆదేశించారు.